# నిర్ణయం

-అన్నాప్రగడ శైలజ

సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన నాకు లత వాకిట్లోనే ఎదురైంది.

"ఏంటి శ్రీమతిగారు ఈరోజు కొత్తగా కనిపిస్తున్నారు?" అన్నాను సరదాగా నవ్వుతూ. లత మాట్లాడకుండా లోపలకు వెళ్లిపోయింది.

ఆమె మౌనం చూస్తుంటే ఇదేదో ప్రళయానికి నాందిలా ఉంది అని అనుకుంటూ కుర్చీలో కూర్చున్నాను.

"మీ అమ్మగారు రేపు ఊరికి వెళ్తానంటున్నారు. ఈసారి మీ అన్నయ్యల మీదకు గుబులు మళ్లిందేమో మరి!" అంది లత కాఫీ అందిస్తూ.

"అమ్మ అన్నయ్యల దగ్గరకు వెళ్తానని చెప్పిందా? అయినా అమ్మ మన దగ్గరకు వచ్చి కనీసం పది రోజులు కూడా కాలేదు. అప్పడే వెళ్తానంటోందేమిటి?" అన్నాను.

"ఇది మరీ బాగుంది. ఆమె ఎందుకు వెళ్తోందో నన్నడుగుతారేంటి? వెళ్లి మీ అమ్మగారినే అడగండి" అంటూ లోపలకి వెళ్లిపోయింది.

నాకేం అర్థంకాలేదు. నేను లేని సమయంలో వీళ్ల మధ్య గొడవలేం జరగలేదుకదా.

అమ్మను పలకరిద్దామని ఆమె గదిలోకి వెళ్లాను.

అమ్మ రామకోటి రాసుకుంటూ కనిపించింది.

పక్కనే కూర్చుని "ఏంటమ్మా! ఊరికి వెళతానన్నావట. అదేంటి వచ్చి పదిరోజులు కూడా కాలేదు. అప్పుడే వెళ్తానంటావేమిటి? అన్నయ్యల దగ్గరి వెళ్తున్నావా?" అని అడిగాను.

అమ్మ తలెత్తి నా వంక చూసింది.

"అన్నయ్యల దగ్గరకు కాదురా. మన ఊరికే వెళ్తున్నాను. రేపు ఉదయం నన్ను బస్సు కాస్త ఎక్కించి నువ్వు ఆఫీసుకెళ్లు" అంది అమ్మ.

నేను ఏదో చెప్పబోయాను. ఇక మాట్లాడాల్సింది ఏమీ లేదన్నట్లు రామకోటి రాయడంలో మునిగిపోయింది అమ్మ.

అమ్మ ఎందుకో ముభావంగా ఉన్నట్లు అనిపించి "ఏమైందమ్మా అలా ఉన్నావు? లత నిన్నేమైనా అందా! అతిగా మాట్లాడడం లతకు మొదటి నుంచి ఉన్న అలవాటేగా! నువ్వేమీ పట్టించుకోకు" అన్నాను.

"అదేం లేదులేరా శివా! మా ఇద్దరి మధ్య గొడవలెందుకొస్తాయి. దీని గురించి నువ్వేం ఆలోచించకు. నాకు ఇంటిదగ్గర కొంచెం పనులున్నాయి. అందుకనే వెళ్తున్నాను. నువ్వెళ్లి రెస్టు తీసుకో" అని అంది. నేనింక ఏమీ మాట్లాడలేకపోయాను. మౌనంగా నేను లేచి నా రూములోకి వెళ్లిపోయాను.

***

రాత్రంతా అమ్మ గురించి ఆలోచిస్తూనే పడుకున్నాను. అమ్మకు మేము ముగ్గురం కొడుకులం. అందరిలోకి నేనే చిన్నవాణ్ని. మా చిన్నప్పుడే నాన్న చనిపోతే కష్టపడి పొలం పనులు చూసుకుంటూ మా ముగ్గుర్ని పెంచి మాకిష్టమైన చదువులు చెప్పించి మమ్మల్ని మంచి ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దింది. కానీ ఆమె దురదృష్టమేమిటంటే ఆమెకు వచ్చిన కోడళ్లకు ఆమె అంటే గిట్టదు నా భార్యతో సహా.

ఎవ్వరూ ఆమెను సరిగ్గా పలుకరించరు. కానీ మా బలవంతం మీద అప్పుడప్పుడూ మా దగ్గరకు వచ్చి పది రోజులు ఉండి వెళ్తుంటుంది. అన్నయ్యలు పెళ్లాల మాట జవదాటరు. అందుకే అమ్మను రమ్మని పిలవరు. అమ్మకే వాళ్లను చూడాలనిపిస్తే వెళ్తుంది. నేను నా భార్యకు, అమ్మకు రాజీ చేయాలని ప్రయత్నించినా అది వీలు కాలేదు. ఇలా ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను. మరుసటి రోజు అమ్మను బస్సు ఎక్కించి ఆఫీసుకు వెళ్లిపోయాను.

***

పది రోజుల తరువాత ఒక రోజు బస్టాండులో మా ఊళ్లో మా పొలం కౌలు చేసే రామయ్య కనిపించి నన్ను పలుకరించాడు.

మాటల మధ్యలో తను "అమ్మగారు పొలం అమ్మారు గదా! ఆ రోజు మీరు రాలేదేమిటి? అయినా మీకు ఇప్పుడు పొలం అమ్మవలసిన అవసరం ఏమొచ్చింది?" అనడిగాడు.

నాకు ఆశ్చర్యమేసింది.

'అమ్మ పొలం అమ్మిందా! అదీ మాకెవ్వరికీ చెప్పకుండా!' అని అనుకొని ఇవన్నీ రామయ్యకెందుకులే తెలియడం అని కాసేపు మాట్లాడుకొని ఎవరి దారి వారు వెళ్లిపోయాం.

అదే విషయం ఇంటికి వెళ్లి శ్రీమతికి చెప్పాను.

ఈ విషయం వినగానే ఆమె మొహం కోపంగా ఎర్రబడింది.

"ఇప్పటికయినా అర్థమయిందా మీ అమ్మగారి మనస్తత్వం. ఎంతసేపూ మీరు అమ్మా... అమ్మా అంటారే! మరి ఆ అమ్మ ఈ రోజు పొలం అమ్ముతూ మాట మాత్రమైనా మీతో చెప్పిందా! ఎవరో ఊళ్లో వాళ్లు చెప్తే తెలిసింది. ఇక మనం ఆలస్యం చేస్తే లాభం లేదు. పదండి ఆవిడ దగ్గరకే వెళ్లి తేలుద్దాం. అసలు ఎంతకు అమ్మారో! మన వాటా ఎంతొస్తుందో! ఈ రోజుల్లో ఎవ్వరినీ నమ్మటానికి వీలులేదు" అని ఉన్న పళంగా మా ఊరు బయల్దేరదీసింది. ఊరికి వెళ్లి ఇంటికి వెళ్లేసరికి మిట్టమధ్యాహ్నం అయింది. ఇంట్లో అమ్మ ఎవరితోనో మాట్లాడుతూ కనిపించింది.

మమ్మల్ని చూసి "రారా శివా! ఇప్పుడేనా రావటం. లోపలకి వెళ్లి కూర్చోండి. వాళ్లను పంపించి వస్తాను" అంది.

మేం లోపలకి వెళ్లాం. లోపలకు వాళ్ల మాటలు వినబడుతూనే ఉన్నాయి. "మరీ అంత రేటు అయితే ఎట్లా అమ్మా! ఇంకో మాట చెప్పండి" అంటున్నారు వచ్చినవాళ్లు.

"అదేం లేదు నేను న్యాయంగానే చెబుతున్నాను. మీరే మరీ అన్యాయంగా తక్కువ రేటుకు ఇల్లు కొనేయాలనుకుంటున్నారు. అయినా ఇంత పెద్ద ఇల్లు మీరడిగిన రేటుకి ఎట్లా వస్తుంది" అంటోంది అమ్మ.

వాళ్ల మాటల సారాంశం బట్టి మాకర్థమైన విషయమేమిటంటే త్వరలో అమ్మ ఇల్లు కూడా అమ్మేయబోతోందని.

రేటు ఎటూ తేలక వాళ్లు ఇంకొకసారి వస్తామని వచ్చినవాళ్లు వెళ్లిపోయారు.

వాళ్లు వెళ్లిన తరువాత అమ్మ లోపలకి వచ్చింది.

"ఏంటిరా శివా! ఇలా అనుకోకుండా వచ్చావు? అస్సలు నమ్మలేకపోతున్నాను. అయినా నేనే మీ ముగ్గురన్నదమ్ములనూ రమ్మని కబురు చేద్దామనుకుంటున్నాను. ఈ లోపు నువ్వే వచ్చావు" అంది.

"అది సరే అమ్మా ఎవరూ వాళ్లు? ఏంటి రేటు అదీ అంటున్నారు. ఇల్లేమన్నా అమ్ముదామనుకుంటున్నావా? అవునూ! నిన్ననే నాకు ఇంకో విషయం తెలిసింది. నువ్వు పొలం కూడా అమ్మావటకదా. ఇప్పుడు నీకు అంత డబ్బు అవసరం ఏమొచ్చింది అమ్మా. మేమంతా ఉన్నాముకదా. డబ్బు నీకవసరమైతే మమ్మల్ని అడగవచ్చుగా. పొలం అమ్మవలసిన అవసరం ఏంటి?" అన్నాను కొంచెం కోపంగా.




ఇంతలో శ్రీమతి "అత్తయ్యగారు అవన్నీ అమ్మితే అమ్మారుగానీ ఇంతకీ మా వాటాకు ఎంతొస్తుందో ముందే చెప్పండి. లేకపోతే తరువాత మేమంతా వాటాలకోసం కొట్టుకు చావాలి'' అంది.

"మీకంత కష్టం రానీయనులేమ్మా! అసలు నేను వాటాలు వేస్తేనే కదా! మీ వాటా మీకు రావటానికి'' అంది తేలిగ్గా.

అప్పటివరకు వేడిగా ఉన్న వాతావరణం ఆమె మాటలకు ఒక్కసారిగా సూది పడితే వినబడేంత నిశ్శబ్దంగా మారిపోయింది.

"ఒరే శివా! ఈమధ్య నేనొక 'నిర్ణయం' తీసుకున్నానురా. అది మీకందరికీ చెప్పాలనే రమ్మని ఫోను చేద్దామనుకుంటున్నాను. నేను పొలం అమ్మిన మాట నిజమే. అలాగే ఇల్లు కూడా అమ్మేయాలని అనుకుంటున్నాను. కానీ ఆ మొత్తంగా వచ్చిన డబ్బును మాత్రం మీకెవ్వరికీ ఇవ్వదలుచుకోవట్లేదు. ఆ డబ్బు మొత్తాన్ని వృద్ధాశ్రమానికి విరాళంగా ఇచ్చి నేను కూడా అక్కడికే వెళ్లి పోదామనుకుంటున్నాను'' అంది.



## హాలీవుడ్ నగ్మా!

ఐశ్వర్యారాయ్, మల్లికా షెరావత్ లాంటి వాళ్లంతా ఇంగ్లీష్ సినిమాల్లో నటిస్తుంటే నేనెందుకు నటించకూడదు అనుకుందేమో- ప్రస్తుతం భోజ్‌పురి సినిమాలతో బిజీగా వున్న నగ్మా త్వరలోనే హాలీవుడ్ తెరకి పరిచయం కాబోతోందిట. ఇంతకీ నగ్మా వేసేది చిన్నా చితకా పాత్ర కూడా కాదుట, చాలా ప్రాధాన్యం గల పాత్రేనట. మొత్తానికి నగ్మా కూడా ఇంటర్నేషనల్ స్టార్ అవుతుందన్నమాట. ఆల్ ది బెస్ట్ నగ్మా!




"ఈ ఆస్తిలో మాకు వాటా లేదా? ఏంటి మీరు అర్థం లేకుండా మాట్లాడుతున్నారు?' అంది లత కోపంగా.

"ఇది పూర్వీకులు ఇచ్చిన వారసత్వ ఆస్తి కానే కాదు లతా. మీ మామగారు వీడి చిన్నప్పుడు చనిపోతే నేను కష్టపడి కాస్తోకూస్తో సంపాదించుకున్నవి. వీటి మీద సర్వహక్కులు నావే. వీటిని నేను ఏమైనా చేసుకోవచ్చు. అందుకే నా ఆస్తి మొత్తం ఆశ్రమానికి ఇచ్చేస్తున్నాను. అయినా మీకేమి తక్కువ చేసాను? అయినా ఇప్పుడే నేనిచ్చే డబ్బు మీదే మీరు బ్రతుకుతారా చెప్పండి. మీకందరికీ ఇళ్లున్నాయి. అంతో ఇంతో బ్యాంకు బ్యాలెన్సు ఉంది. ఇక నా డబ్బుతో పనేంటి. అదీగాక నేను నా డబ్బును నలుగురికి ఉపయోగపడేలా సద్వినియోగపరచాలనుకుంటున్నాను. అందుకనే ఆశ్రమానికి ఇచ్చి అక్కడికే వెళ్లిపోదామనుకుంటున్నాను'' అంది.

"అమ్మా! నీకేమన్నా పిచ్చి పట్టిందా? ఆశ్రమానికి ఎవరూ లేని అనాథలు వెళ్తారు. నువ్వేమన్నా అనాథవా! నీకు ముగ్గురు కొడుకులున్నారు. నీకు ఎవరి దగ్గర ఉండాలనిపిస్తే వాళ్ల దగ్గర ఉండవచ్చుకదా'' అన్నాను కోపంగా.

"ఒరే శివా! నేను ఇలా అంటున్నానని తప్పుగా అనుకోకు. కొడుకులు అని ఇప్పుడంటున్నారుగానీ ఏ రోజైనా అమ్మకు ఇచ్చే విలువ ఇచ్చారా మీరు? పెళ్లాలు రాగానే అమ్మని మర్చిపోయారు. మీ దగ్గర ఉన్నా ఇంట్లో మీ ఆవిడ నాతో సరిగ్గా మాట్లాడదు. నువ్వేమో ఆఫీసుకు వెళ్లిపోతావు. ఇక నేను ఎవరి కోసం ఇంట్లో ఉండాలి. కుటుంబమంటే నలుగురు కలిసి సరదాగా ఉండటం. అంతేగానీ ఒకళ్ల మీద కోపంతో ఒకళ్లు మాట్లాడుకోకుండా ఉండటం కాదు. పోనీ సర్దుకుపోయి ఉందామన్నా ఇంట్లో స్వేచ్ఛ అనేది ఉండదు. ఇంట్లో ఏది ముట్టుకున్నా తప్పే మీ ఆవిడకు. ఫ్రిజ్ తీస్తే చాలు మాటిమాటికి తెరుస్తారే అంటుంది. టీవీలో భక్తి కార్యక్రమాలు చూద్దామనుకుంటే పిల్లలు చదువుకుంటుంటే టీవీ పెడతారే అంటుంది. ఇవన్నీ నేను తన మీద చాడీలుగా మాత్రం చెప్పటం లేదు. మొన్నటికి మొన్న బిచ్చగాడికి చద్ది అన్నం పెట్టి లోపలికి వస్తుంటే 'మీ బాబు సొమ్మేమన్నా ఉందనుకున్నారా ఇష్టమొచ్చినట్లు దానాలు చేయడానికి? వాడికి పెట్టే బదులు మనమే మధ్యాహ్నం ఎవరో ఒకరు పెట్టుకోవచ్చుగా' అంది. ఆ సమయంలో నాకెంత బాధ వేసిందో నీకు తెలుసా? దేవుడి దయవల్ల మనకు సరిపడినంత డబ్బు ఉంది. దానిలో కొంతైనా నలుగురికి ఉపయోగపడేటట్లు చేయాలనే నా ఆశ. ఒక మనిషికి ఒక పూట భోజనం పెడితే మన ఆస్తి ఏమన్నా తరిగిపోతుందా చెప్పు. అతను కడుపు నిండా తింటే ఎంత తృప్తి. అన్నదానానికి మించిన దానమున్నదా ఈ లోకంలో. ఒకవేళ నేను ఈ ఆస్తిని భాగాలు చేసి పంచి ఇచ్చినా అది తీసుకుని మీరు బ్యాంకు బ్యాలన్సు ఇంకొంచెం పెంచుకుంటారేగానీ ఒక్క మెతుకు కూడా బయటకు విదల్చని మనస్తత్వం మీది. అందుకనే నేను మీకు ఇచ్చే డబ్బును ఆశ్రమానికి విరాళంగా ఇస్తే అది అక్కడున్న నాలాంటి వృద్ధులెందరినో ఆపద సమయాలలో ఆదుకుంటుందనే ఈ పని చేస్తున్నాను.నేను మీ దగ్గర ఉండనప్పుడు ఇక్కడ ఈ ఇంట్లో ఉన్నా ఒక్కటే. అక్కడ వృద్ధాశ్రమంలో ఉన్నా ఒక్కటే. ఇక్కడయితే నేనొక్కదాన్నే. అక్కడయితే నాలాగా ఎందరో. నన్ను చూసి మీరు ఇలాంటి అమ్మలు కూడా ఉంటారా అని అనుకోవచ్చు. ఈ నా 'నిర్ణయాన్ని' లోకం కూడా హర్షించకపోవచ్చు. కానీ నాకంటూ కొన్ని ఆశయాలు ఉన్నాయి. బ్రతికినన్నాళ్లు నలుగురికి ఉపయోగపడాలన్నది నా ఆశ. ఆకాంక్ష.

ఇదే విషయం మీ అన్నయ్యలకు కూడా చెప్తాను. ఎప్పుడైనా మీకు నన్ను చూడాలనిపిస్తే తప్పకుండా ఆశ్రమానికి రావచ్చు. మీకు నేను తల్లిగా అక్కర లేకపోవచ్చుగానీ మీరెప్పటికీ నా బిడ్డలే. ఇక ఆ తరువాత మీ ఇష్టం'' అంది అమ్మ.

అమ్మ మాటలకు మేమిద్దరం నోట మాట రానట్టు అలాగే షాక్ కొట్టినట్టుగా నిలబడిపోయాం.

★